క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని బొగ్గేరు వద్ద నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ సీఐ బి.నయనతార గురువారం బొగ్గేరు సమీపంలో పట్టుకున్నారు. తొలిసారి కావడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానా విధించినట్లు ఆమె తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్నిశాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు. ఆమె వెంట ఎస్సై టి.కిరణ్‌కుమార్, సెబ్ సిబ్బంది ఉన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, సచివాలయ కన్వీనర్ యలమల మాల్యాద్రిరెడ్డి కుమారుడు వివాహ వేడుకలకు గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు మహేష్‌రెడ్డి–అనూషరెడ్డిలను ఆశీర్వదించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా మస్తాన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరంలో వాగు పోరంబోకు భూములను ఆక్రమించి వర్షపునీరు, గ్రామంలోని మురుగునీరు వాగులోకి వెళ్లకుండా అడ్డగిస్తున్నారని సర్పంచ్ ఫిర్యాదు మేరకు గురువారం కావలి ఆర్డీఓ శీనా నాయక్ ఆక్రమిత భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. అయితే గ్రామంలోని ఇరువర్గాల వారు ఆక్రమిత భూముల విషయంపై ఒకరితో ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేయలేకపోయారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాగు పోరంబోకులోని ఆక్రమిత భూములను త్వరలో తొలగిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎస్సై కోటిరెడ్డి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఆనం వ్యాఖ్యలు సరికాదు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోందని, అందులో భాగంగా కార్యక్రమం ముందురోజు ఆ ప్రాంత వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించాలని పేర్కొనడం ఏడాది కాలంగా జరుగుతోందని, ఇలా సమావేశాన్ని నిర్వహించడాన్ని తప్పుబట్టడం సీనియర్ రాజకీయనేతనని చెప్పుకొనే ఆనం రామనారాయణరెడ్డికి తగదని వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆనం రామనారాయణరెడ్డి వలంటీర్ల సేవలను కించపరిచేలా మాట్లాడడాన్ని ఖండించారు. సంగంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తుండగా ఓట్లు మార్చేస్తున్నారంటూ ఆనం నానాయాగీ చేయడం సరికాదని పేర్కొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

ఆత్మకూరురూరల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సమీకృత గిరిజనాభివృద్ధి (యానాదులు), ఆత్మకూరు అభిరామ్ హాస్పిటల్స్, నెల్లూరు అనసూయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు సంయుక్తంగా ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆత్మకూరు జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

నూతన పింఛన్ల అందజేత



6వ వార్డులో నూతన పింఛన్ అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నూతన మంజూరైన పింఛన్లను గురువారం ఆయా వార్డుల కౌన్సిలర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన బీమా వారోత్సవాలు

- విద్యార్థులకు బహుమతుల అందజేత

ఆత్మకూరు: ఎల్ఐసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీమా వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ మెహ్రాకుమార్ మాట్లాడుతూ దేశంలోని అతి పెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ అని, ప్రజల ఆరోగ్య, జీవిత భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే ఎల్ఐసీ 68 శాతం ప్రీమియంలు, 78 శాతం పాలసీలతో మార్కెట్‌లో అగ్రభాగాన ఉందన్నారు. వారోత్సవాల్లో భాగంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి ఏవీ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

హే కృష్ణా.. ముకుందా..



ఆత్మకూరు: హిల్ రోడ్డులోని కృష్ణమందిరంలో రాధాకృష్ణుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆత్మకూరు: టెంకాయతోపు రాధాకృష్ణ మందిరంలో విశేష అలంకరణ



దుత్తలూరులో ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు



ఆత్మకూరు: టెంకాయతోపులోని కృష్ణమందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

- వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి
- కనులపండువగా రాధాకృష్ణుల కల్యాణోత్సవం
- ఉట్టి మహోత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్న యువత
- భక్తులకు భారీ అన్నదానాలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఆత్మకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీకృష్ణ మందిరాలు, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాలు, విష్ణాలయాల్లోని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించారు. అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు ఆలయాల్లో రాధాకృష్ణుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి శోస్త్రోక్తంగా కల్యాణోత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు వేలాదిగా పాల్గొని రాధాకృష్ణులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టి మహోత్సవాల్లో యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలుచోట్ల భగవద్గీత పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. నిర్వాహకులు, దాతలు భారీ అన్నదానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సంగం: కృష్ణమందిరంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం కంపసముద్రంలోని శ్రీకృష్ణమందిరంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి కల్యాణోత్సవం



అనుమసముద్రంపేటలోని శ్రీకృష్ణమందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు



ఆత్మకూరురూరల్: వాశిలి డిపెప్ పాఠశాలలో చిన్నికృష్ణుడి వేషధారణలో విద్యార్థులు



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని కృష్ణమందిరంలో వేడుకలు



అల్లూరు: కోనేటి సెంటర్ అభయాంజనేయస్వామి పుష్కరిణి వద్ద ఉట్టి మహోత్సవం



ఆత్మకూరురూరల్: బట్టేపాడులోని శ్రీకృష్ణ మందిరంలో స్వామివారికి విశేష అలంకరణ

ప్రజల ఆశీస్సులతో మళ్లీ జగనన్న ప్రభుత్వమే



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
- రూ.9.80 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనుల ప్రారంభం

సంగం: ప్రజల ఆశీస్సులతో 2024లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంగంలోని బిట్–3 సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సంగంలో రూ.9.80 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డు, సైడు కాలువలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సంగంలోని రాళ్లచెలిక, బీసీకాలనీ ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లోనూ ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ప్రతి గడపలోనూ ప్రజలు తమకు ఆనందంగా తెలియజేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సంగం గ్రామంలో ఇటీవల పెన్నానదిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన లోసారి మనోజ్‌కుమార్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రావుల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ మానికల చందన్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గంగపట్నం చంద్రశేఖరయ్య, కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, గుండాల బాలచంద్రారెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, జహంగీర్, కరిముల్లా, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో ఆత్మహత్యాయత్నం

చేజర్ల: మండలంలోని నూతక్కివారికండ్రికకు చెందిన మురళీకృష్ణ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు, బంధువుల సమాచారం మేరకు పనిఒత్తిడి కారణంగా తన ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం తొలుత పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం చంద్రమౌళినగర్ ప్రాంతానికి చెందిన సచివాలయంలో మురళీకృష్ణ వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఘన సన్మానం



చేజర్ల(సోమశిల): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న మెట్టుకూరు సుబ్బారెడ్డిని అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–2 కె.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు.

టీడీపీ మూకలు కుయుక్తులు పన్నుతున్నాయి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ మూకలు ఊర్లపై పడి అల్లకల్లోలం సృష్టించేందుకు అనేక కుయుక్తులు పన్నుతున్నాయని, ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని 33వ వార్డులో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడికి రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లను ఎందుకు నిర్మించలేకపోయారో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని తెలిపారు. అలాగే రామాయపట్నంపోర్టు నిర్మాణానికి ఉన్న అవరోధాలన్నింటినీ తొలగించి నిర్మాణ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. వందేళ్ల నాటి రెవెన్యూ రికార్డులు గందరగోళంగా ఉండడంతో అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ రీ సర్వే చేయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దారని, ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు అందించి సొంతింటి కలను నెరవేరుస్తున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని, వారి మాటలను నమ్మవద్దని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, అమర వేదగిరి, డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, కాటా శ్రీనివాసులురెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, తలపనేని ప్రభాకర్‌నాయుడు, కనుపర్తి రాజశేఖర్, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మామిడి రామకృష్ణ, తిరువీధి ప్రసాద్, చీదెళ్ల కిషోర్, ఆత్మకూరు రాజేష్, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జువ్వలదిన్నె వీఆర్ఏపై చర్యలు చేపట్టాలని వినతి

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె వీఆర్ఏ దుగ్గిరాల పెనుగొండయ్య భూఆక్రమాలకు పాల్పడుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక ఎస్సీ కాలనీవాసులు తహసీల్దార్ హేమంత్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. భూఆక్రమణలకు పాల్పడడంతోపాటు రికార్డులు తారుమారు చేయడం, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న రోడ్డును ఆక్రమించి స్థానికులు రాకపోకలు సాగించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నాడని, అలాగే గ్రామానికి చెందిన పిడుగు శ్రీనివాసులు కొనుగోలు చేసి అనుభవంలో ఉన్న భూమికి సంబంధించి అడంగల్ రికార్డులు తారుమారు చేశారని తెలిపారు. అంతేకాకుండా సర్వే నంబర్ 635లోని శ్మశానవాటిక స్థలాన్ని, సర్వే నంబర్ 642లోని పులక కాలువను, సర్వేనంబర్ 691 లోని భూమిని ఆక్రమించి రికార్డులు తారుమారు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులు ఇంటిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెలగపాడులో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తొలుత జెడ్పీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేశారు. ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. సోమశిల ఉత్తర కాలువ ద్వారా చెరువులకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పలు సమస్యలపై స్థానిక అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, సర్పంచ్ దేవనబోయిన వెంకటసుబ్బయ్య, నాయకులు చిట్టేల నాగేంద్రరెడ్డి, మాలేపాటి వెంకటసుబ్బయ్య, మెట్టుకూరు భాస్కర్‌రెడ్డి, తగరం హజరత్తయ్య, ఆత్మకూరు పోలయ్య పాల్గొన్నారు.